

వీసీ లేదు..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయ యూనివర్సిటీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. 8 నెలలుగా పాలక మండలి (ఈసీ), మే 21వ తేదీ నుంచి పూర్తి స్థాయి వైస్‌చాన్సలర్ లేక కేయూలో పాలన గాడి తప్పుతోంది. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఈసీ, వీసీ లేకపోవటంతో వర్సిటీకి సంబంధించిన ప్రధానమైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించిన ప్రభుత్వం.. కేయూకి మాత్రం ఈసీ లేకపోవటంతో కమిటీ వేయలేకపోయింది. దీంతో కొత్త పాలక మండలి ఎప్పుడు వస్తుందో..? యూనివర్సిటీకి కొత్త వీసీని ఎప్పుడు నియమిస్తారో? అనే ఉత్కంఠతో ప్రొఫెసర్లు, విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

ముగిసిన ఈసీ, వీసీల పదవీకాలం

పైరవీలు, అక్రమాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన కలగానే మారుతోంది. పాలకమండలికి కొత్త కమిటీని నియమించటంలో చేస్తున్న తాత్సారం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోంది. గత అక్టోబరు 22వ తేదీనే కేయూ పాలక మండలి పదవీకాలం ముగిసింది. అక్టోబరు, నవంబరు నెలల్లో ఎన్నికల కోడ్ కారణంగా కొత్త ఈసీలను నియమించటం కుదరలేదు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు కనీసం కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీని ప్రభుత్వం నియమించలేదు. దీంతో యూనివర్సిటీలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా, గత నెల 21వ తేదీన కేయూ వైస్ చాన్సలర్ రమేష్ పదవీకాలం పూర్తి అయింది. దీంతో కేయూకు సీనియర్ ఐఏఎస్ అధికారిణి కరుణను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. ఇదిలా వుండగా, 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో యూనివర్సిటీలో కొత్త కోర్సుల ప్రవేశ పెట్టడంతో పాటు వేతనాలు, ఉద్యోగ నియామకాలు, కొత్త ప్రాజెక్టుల నిర్వహణకు కావాల్సిన బడ్జెట్‌తో పాటు కేయూ భూముల అక్రమణాలు, వివిధ కమిటీల నివేదికలపై నిర్ణయం తీసుకోవాల్సిన పాలకమండలి, పూర్తిస్థాయి వైస్‌చాన్సలర్ లేకపోవటం సమస్యాత్మకంగా మారింది.


కేయూ

సెర్చ్ కమిటీ కూడా లేదాయే..

కాకతీయ యూనివర్సిటీకి వైస్‌చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభు త్వం సెర్చ్ కమిటీని కూడా నియమించ లేదు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులను నియమిస్తారు. వీరిలో ఒకరు ప్రభుత్వం నుంచి, మరొకరు విద్యాశాఖ నుంచి ఉంటారు. ఇంకొకరిని యూనివర్సిటీ పాలక మండలి నుంచి సూచిస్తారు. ఈ ముగ్గురు నేతృత్వంలో సెర్చ్ కమిటీ వైస్‌చాన్సలర్‌ను ఎంపికచేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తుంది. అయితే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పూర్తి స్థాయి పాలక మండలి ఉన్నప్పుడే సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును ఖరారు చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే కేయూ నుంచి మాత్రం సెర్చ్ కమిటీ సభ్యుడిని ఎంపిక చేయకుండానే అక్టోబరులో పాలక మండలి పదవీకాలం పూర్తయింది. గత వీసీ నిర్లక్ష్యంతో సెర్చ్ కమిటీని ఎంపిక చేయలేదని ఆకుట్ సభ్యులు విమర్శిస్తున్నారు.

- కాకతీయ యూనివర్సిటీకి దిక్కెవరు?
- పాలక మండలి ఏర్పాటులో తాత్సారం
- గత అక్టోబరులోనే ముగిసిన ఈసీ పదవీకాలం
- మే 21న ముగిసిన వైస్ చాన్సలర్ పదవీకాలం
- ఇన్‌చార్జి వీసీ పాలనలోనే వర్సిటీ
- కేయూలో కీలక నిర్ణయాలపై ప్రభావం
- ఈసీ లేకపోవడంతో ఏర్పాటు కాని సెర్చ్ కమిటీ
- కేయూ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తులు

దరఖాస్తు చేసుకున్నా..

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వైస్‌చాన్సలర్ నియామకం కోసం ప్రభుత్వం జనవరి 27వ తేదీన నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. కాకతీయ

» మిగతా 8వ పేజీలో...

పాలకమండలి - విధులు

యూనివర్సిటీలో 13మందితో పాలక మండలిని నియమిస్తారు. ప్రతీ యూనివర్సిటీ ఈసీకి వైస్ చాన్సలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మిగతా 13 మంది సభ్యుల్లో విద్యాశాఖ, ఆర్థికశాఖ, కళాశాల విద్యాశాఖ కమిషనర్, (సాంకేతిక యూనివర్సిటీ అయితే సాంకేతిక విద్యాశాఖ కమిషనర్) ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ఉంటారు. అలాగే యూనివర్సిటీ కాలేజీల నుంచి ఒక ప్రిన్సిపాల్, ఇద్దరు అధ్యాపకులు, డిగ్రీ కాలేజీల నుంచి ఒక ప్రిన్సిపాల్, ఒక అధ్యాపకుడు, సమాజంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను నలుగురిని కలుపుకుని మొత్తం 13మందితో సభ్యులను ప్రభుత్వం నియమిస్తుంది. ఈ కమిటీ తీసుకునే నిర్ణయమే విధానంగా మారుతుంది. యూనివర్సిటీకి సంబంధించిన ఏ పని చేయాలన్న ఈసీ అనుమతి తప్పనిసరి. దానినే వీసీ అమలు చేస్తారు. అంతేకాకుండా అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, ప్రమోషన్స్, ఉద్యోగాల భర్తీ, సైంటిఫిక్ పరికరాలు, ల్యాబ్ వస్తువుల కొనుగోలు, యూజీసీ నిధులు వినియోగం ఇలా అన్నింటికీ ఈసీ ఆమోదం తప్పనిసరి.

కాంగ్రెస్ పాలనలో బడులు బలోపేతం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


హరిపిరాల బడిబాటలో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి

తొర్రూరు రూరల్, జూన్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోనే సర్కారు పాఠశాలలను బలోపేతం చేస్తూ.. విద్యారంగంలో సమూలమైన మార్పులు చేయడానికి శ్రీకారం చుడుతున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమానికి హరిపిరాల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై నోటు పుస్తకాలు, దుస్తులు అందజేసి చిన్నారి విద్యార్థులకు అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే పాఠశాలలు ప్రారంభమైన రోజునే దుస్తులు, పుస్తకాలు అందజేయడం మొదటిసారి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి 73 రకాల పనులు గుర్తించి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని అందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సకల సౌకర్యాలను సమకూరుస్తున్నట్లు తెలిపారు.

పేద ప్రజలకు అండగా ప్రభుత్వం..

తొర్రూరు : రాష్ట్రంలో పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. పంద్రాగస్టులోపు సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తారని తెలిపారు. వివిధ పనులు, కారణాలతో కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి సమీక్షించారు. అలాగే మునిసిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు బిల్ కలెక్టర్‌లు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతిపత్రం అందించారు. సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు వెంకట్రాంనర్సయ్య మాట్లాడారు. ఇటీవల జీలుగ విత్తనాల అవకతవకల్లో సస్పెన్షన్‌కు గురైన ఏఈవోలు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు.

ప్రేమించి మోసం చేశాడంటూ..

- ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి నిరసన
- మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువతి
- ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు


కుటుంబ సభ్యులతో కలిసి ప్రియుడి ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న యువతి

చిలుపూర్, జూన్ 15 : తనను నాలుగేళ్ళుగా ప్రేమ పేరుతో వంచించి మోసం చేయడమే కాకుండా మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధపడడంతో మనస్తాపం చెందిన యువతి ప్రియుడి ఇంటి ఎదుట నిరసన చేపట్టింది. మనస్తాపంతో పురుగుల మందు తాగడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తోంది. ఇదే మండలం రాజవరం గ్రామానికి చెందిన గంగారపు కృష్ణ కూడా అక్కడే ఉంటూ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. పెళ్ళి చేసుకుంటానని చెప్పి నమ్మించి ఆ యువకుడు నాలుగేళ్ళుగా కలిసి తిరిగాడు. తీరా తనను పెళ్ళి చేసుకోవాలని సదరు యువతి ఒత్తిడి చేయడంతో ఇష్టంలేక స్వగ్రామానికి వచ్చి మరో యువతితో పెళ్ళికి సిద్ధపడ్డాడు. విషయం తెలిసిన బాధిత యువతి శనివారం తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి రాజవరంలోని కృష్ణ ఇంటికి చేరుకోగానే కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తనకు న్యాయం చేయాలంటూ వారి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. జరిగిన అన్యాయానికి మనస్తాపం చెంది పురుగుల మందు సేవించింది. కుటుంబ సభ్యులు వెంటనే 108 ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చిలుపూర్ ఎస్సై ముత్యం రాజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జూన్ 15: జపాన్‌లో స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్‌గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్.ఉమారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్కర్స్ ఎంపిక కోసం టామ్‌కామ్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోందని, బీఎస్సీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లు /జీఎన్ఎం డిప్లొమా/ఏఎన్ఎం పారామెడికల్/ఫార్మాసూటికల్ అభ్యర్థులు 22-30 సంవత్సరాల వయస్సు గల వారు ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99519 09863 నంబరులో సంప్రదించాలని సూచించారు.

యువతి కిడ్నాప్‌నకు యత్నం

కేకలు వేయడంతో పరారీ



కిడ్నాప్‌నకు ముందు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన కారు



కిడ్నాప్ యత్నం తర్వాత వెళ్లిపోతున్న కారు

లింగాలఘణపురం, జూన్15: గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు శనివారం ఓ యువతిని కిడ్నాప్ చేసేందుకు యత్నించి విఫలమయ్యారు. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పటేల్‌గూడెం గ్రామానికి చెందిన యువతి వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు కాలినడకన వెళ్తుండగా సిల్వర్ కలర్ కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెతో మాటలు కలిపారు. జనగామ-సూర్యాపేట జాతీయ రహదారి పక్కనే నెల్లుట్ల శివారులోని శ్రీలక్ష్మినర్సింహ వెంచర్‌లో పనులు నడుస్తున్నాయా అంటూ అడిగారు. దీంతో తనకు తెలియదని చెప్పినప్పటికీ యువతిని వెంటాడుతూ వచ్చి బలవంతంగా కారులోకి ఎక్కించే ప్రయత్నం చేశారు. దీంతో వెంటనే ఆమె భయంతో కేకలు వేసింది. సరిగ్గా అదే సమయంలో మహిళా కూలీలతో వచ్చిన ఆటోను చూసి దుండగులు జనగామ వైపునకు వెళ్లిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేసుకొని విచారణ చేపట్టారు. అయితే అనుమానిత కారు జనగామ నుంచి ఉదయం 9.22 నిమిషాలకు నెల్లుట్ల మీదుగా వచ్చి తిరిగి 9.31 నిమిషాలకు వెళ్లిపోయినట్లుగా సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. ఈ విషయమై ఎస్సై రాజును వివరణ కోరగా బాధితురాలు మౌఖిక సమాచారం ఇవ్వడం మినహా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని తెలిపారు. అయితే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు వెంచర్ల వెంట, నిర్మానుష్య ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

17న సదరం కోసం స్లాట్ బుకింగ్

జనగామ కల్చరల్, జూన్ 15: సదరం సర్టిఫికెట్ కోసం వికలాంగులు ఈ నెల 17న స్లాట్ బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీవో మొగులప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 27, 28 తేదీలలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నందున జిల్లా లోని అన్ని మీసేవా కేంద్రాలలో 17న సదరం స్లాట్ బుకింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. అర్హులైన వికలాంగులు డాక్టర్ రిపోర్ట్స్, ఆధార్ కార్డు, ఫోటో, మీసేవలో స్లాట్ బుకింగ్ చేసుకున్న రసీదులను వెంట తెచ్చుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే క్యాంపులకు హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనగామ కల్చరల్, జూన్ 15: అత్యవసర పనుల కారణంగా ఈ నెల 16న జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్-1 ఏఈ రామగిరి మధు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నమెంట్ హాస్పిటల్, గీతానగర్ 11కేవీ ఫీడర్లలో మరమ్మతులు ఉన్నందున ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాబ్‌మేళాలో 12 మంది ఎంపిక

జనగామ కల్చరల్, జూన్ 15: జిల్లా ఉపాధి కార్యాలయం, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 12 మంది ఎంపికైనట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్.ఉమారాణి తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన జాబ్‌మేళాకు 63 మంది దరఖాస్తు చేసుకోగా 43 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, వారిలో 12 మంది బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లుగా ఎంపికయ్యారని తెలిపారు.

కాసేపు.. 'కడియం సార్'

విద్యార్థులకు పాఠాలు బోధించిన ఎమ్మెల్యే


మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాల ఘనపురం, జూన్ 15: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. శనివారం ఆయన లింగాలఘణపురం కేజీబీవీ, మోడల్ స్కూళ్లను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో కెమిస్ట్రీ పాఠాలను బోధించారు. బ్లాక్ బోర్డుపై అమ్మోనియా ఫార్ములాను రాసి దానిని విస్తరించాలని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో నైట్రోజన్ మరియు హైడ్రోజన్ సమ్మేళనాలను విస్తరించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పటిష్టమైన విద్యాబోధనకు ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. తాను గతంలో అధ్యాపకుడిగా పనిచేశానని, అనంతరం విద్యాశాఖ మంత్రిగా పనిచేశానని తెలిపారు. విద్యాశాఖలో ఉండే సమస్యల పట్ల తనకు పరిపూర్ణమైన అవగాహన ఉందని అన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేజీబీవీలో క్రీడా మైదానం ఏర్పాటు కోసం కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

కార్యక్రమంలో డీఈవో రాము, జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పాకుమారి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో ముచ్చటించిన జూనియర్ సివిల్ జడ్జి



పిల్లల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జడ్జి కె.సందీప

జనగామ కల్చరల్, జూన్ 15: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సందీప జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించారు. పిల్లల కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఎలా చదువుకుంటున్నారు.. ఆహారం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వల్ల ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? స్నానం చేయడానికి సబ్బులు, పేస్టు మొదలైనవి అందిస్తున్నారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ ఎం.రవీంద్ర, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇ.జ్యోత్స్న, ఆర్.శ్రీహరి, వరూనిక తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో బెదిరిస్తున్నాడంటూ

జీపీ కార్మికుల ధర్నా


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 15: పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలు ఇవ్వాలని, లేదంటే ధర్నా చేస్తామని అన్నందుకు ఘన్‌పూర్ జీపీ స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో వెంకన్న విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఘన్‌పూర్ జీపీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులకు సమస్యను వివరిస్తే జీతాలు ఇచ్చినప్పుడే తీసుకోవాలని.. ఎవరూ అడుగవద్దని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. పనిచేస్తే చేయండి లేదంటే వేరే వాళ్లను విధుల్లో చేర్చుకుంటామని బెదిరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెండు నెలల వేతనాలు ఇప్పించాలని వేడుకున్నారు.

కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు బోసు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు కుంభం రాజు, కార్మికులు చంద్రమౌళి, నీల శ్రీను, నక్క శ్రీను, ఎడ్ల రాజు, వెంకటయ్య, స్వరూప, కోమల, సారయ్య ప్రమోద్, పొన్నం రమేష్, గజేందర్, విజయ్, వెంకటస్వామి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



















నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 15: యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం జరిగే ఈ పరీక్షకు హనుమకొండ జిల్లాలో 11 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 4,730 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటలకు జరుగుతుంది. అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరుగుతుంది. ఉదయం సెషన్‌కు అభ్యర్థులను ఉదయం 9గంటల నుంచే పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం సెషన్‌కు 2గంటల నుంచి పరీక్షాహాల్‌లోకి అనుమతించనున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టీజీఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. ఆయా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవతసర మెడికల్ ఎమర్జెన్సీ సదుపాయాలు ఉంటాయి. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

నగరంలో 144 సెక్షన్

వరంగల్ క్రైం: సివిల్స్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు గాను ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ అభిషేక్ మోహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని ఆయన పేర్కొన్నారు. ఆదేశాలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న వనిత

వరంగల్ క్రైం, జూన్ 15: భర్త వేధింపులు తట్టుకోలేక మాలోతు వనిత(36) అనే మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన బానోతు వీరస్వామి తన కూతురు వనితను 2014లో చెన్నరావుపేట టీకే తండాకు చెందిన మాలోతు బన్సీలాల్‌కు ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో రూ.20లక్షల కట్నం, బంగారు ఇచ్చాడు. హైదరాబాద్‌లో రైల్వేలో ఉద్యోగం చేసే బన్సీలాల్ చెడు వ్యసనాలకు అలవాటుపడి భార్య వనితను వేధిస్తున్నాడు. వనితను బన్సీలాల్‌తో పాటు సోదరుడు, అతడి భార్య వేధిస్తున్నారు. ఇటీవల హనుమకొండలోని పుట్టింటికి వచ్చిన వనిత.. ఈనెల 10న చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం హైదరాబాద్ యశోదకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. తన కూతురు మృతికి కారకులైన అల్లుడు, అతడి సోదరుడు, అతడి భార్యపై శనివారం వీరస్వామి సుబేదారి పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


పి. స్వప్న


పుల్ల శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: కేయూలో ఇద్దరు పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్‌ను ప్రకటిస్తూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కామర్స్ విభాగంలో 'పెర్ఫార్మెన్స్ ఎవాల్యుయేషన్ ఆఫ్ పవర్ సెక్టార్ ఎ స్టడీ' అనే అంశంపై కేయూ ప్రొఫెసర్ డి.సక్రియ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన పుల్ల శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రకటించారు. అలాగే తెలుగులో రావికంటి వసునందన్ వచన రచనలు-సమగ్ర అధ్యయనం అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన పి.స్వప్నకు డాక్టరేట్‌ను ప్రకటించారు.

ట్యాక్స్ బార్ పాలక మండలి సభ్యుడిగా పీవీ నారాయణరావు


పీవీ నారాయణరావు


వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ పాలక మండలి సభ్యుడిగా వరంగల్‌కు చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొజ్జ మధుసూదన్ వెల్లడించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవలను అందిస్తున్న అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం నిరంతం కృషి చేస్తానన్నారు.

భద్రాచలం - వరంగల్ మధ్యనే 'సింగరేణి'

గిర్మాజీపేట, జూన్ 15: వరంగల్ - బల్లార్ష రైల్వే మార్గంలోని ఆసిఫాబాద్ - రేచిణి మధ్య జరుగుతున్న మూడో లైను పనుల్లో భాగంగా ఈ మార్గంలో పలు రైళ్లను పాక్షికంగా రద్దు, దారి మళ్లింపు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే శనివారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా ప్రతీ రోజు భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) నుంచి వరంగల్ మీదుగా బల్లార్ష వెళ్లే సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సోమవారం నుంచి జూలై 6 వరకు భద్రాచలం - వరంగల్ మధ్యే నడుస్తుందని పేర్కొంది. ప్రతీ రోజు మాదిరిగానే సింగరేణి ఉదయం 5.55 గంటలకు భద్రాచలం రోడ్డు నుంచి బయలుదేరి వరంగల్‌కు ఉదయం 8.44 గంటలకు చేరుకుంటుందని తెలిపింది. అలాగే వరంగల్ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 భద్రాచలం రోడ్డు చేరుకుంటుందని పేర్కొంది. హైదరాబాద్ నుంచి కాజీపేట మీదుగా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు నడిచే హైదరాబాద్- సిర్పూర్‌కాగజ్‌నగర్, సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా సిర్పూర్‌కాగజ్‌నగర్ నడిచే సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్‌నగర్ రైళ్లు సోమవారం నుంచి జూలై 6 వరకు హైదరాబాద్ - కాజీపేట, సికింద్రాబాద్ - కాజీపేట మధ్యనే నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

అప్రమత్తతే ఆరోగ్య ఆయుధం

● వర్షాకాలంలో వ్యాధుల భయం ● వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో నివారణ ● ప్రాథమిక దశలోనే చికిత్స పొందాలి



వరంగల్ మెడికల్, జూన్ 14: రానున్న కాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో నీటి నిల్వలు ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటువ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. కలుషిత నీటివల్ల డయేరియా, అతిసారం వంటి వ్యాధులు విస్తృతంగా వస్తాయి. దీనికి తోడు దోమకాటు కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళిక రచించినప్పటికీ వ్యక్తిగతంగా ఎవరికి వారు కొన్ని నియమాలు తప్పక పాటించాల్సిన అవసరం ఉంది. సమాజ ఆరోగ్యం కోసం సమష్టిగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

వైరల్ ఫీవర్ (విష జ్వరం)

వాతావరణంలో మార్పులు, కొన్నిరకాల వైరస్‌ల కారణంగా వైరల్ ఫీవర్ సోకుతుంది. ఇంట్లో ఒకరికి వస్తే మిగతా వారికి కూడా ఈ ఫీవర్ బారిన పడే అవకాశం ఉంది. ఈ జ్వరంలో రోగికి 103 నుంచి 107 ఫారిన్ హీట్ వరకు జ్వరం ఉంటుంది. గొంతు నొప్పి, జలుబు, ఆకలి మందగించడం, తలనొప్పి, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మలేరియా

వర్షాకాలంలో దోమకాటుతో వచ్చే వ్యాధుల్లో మలేరియా ప్రధానమైంది. దోమ కుట్టిన 10 నుంచి 14 రోజులలోపు అది లక్షణాలు బయట పడతాయి. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒంటి నొప్పులు, చలి ఎక్కువగా ఉంటుంది. చెమటలు పట్టడం, కొన్ని సార్లు వాంతులు కూడా వచ్చే అవకాశం ఉంది. జ్వరం వచ్చిన తొలి రోజునే మలేరియాను నిర్ధారించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స పొందకపోతే కాలేయం. కిడ్నీ, గుండె, రక్తనాళాలపై ప్రభావం చూపి రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా పొంచి ఉంది.

డెంగీ

దోమ కుట్టిన వారం తర్వాత ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదిలించలేని పరిస్థితి ఎదురవుతుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి వస్తుంది. కొందరి శరీరంపై పొక్కులు, దద్దుళ్లు వంటివి వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మలవిసర్జన కనిపిస్తాయి. ఈ వ్యాధికారక వైరస్ రక్తంలో ఉత్పత్తి అవుతున్న ప్లేట్‌లెట్స్‌ను తినేస్తుంది. ఫలితంగా రక్తంలో ప్లేట్‌లెట్ సంఖ్య గణనీయంగా తగ్గి అంతర్గత రక్తస్రావం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. నీటిపై ఉండే దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. అందుకే నిలువ ఉంచిన బిందెలను కచ్చితంగా మూతలు ఉంచాలి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు మాత్రమే చికిత్స పొందాలి.

చికున్ గున్యా

డెంగీ కారక దోమకాటుతోనే చికున్‌గున్యా వ్యాధి సోకుతుంది. గున్యా వైరస్ బారిన పడిన వారిని కుట్టిన దోమ మరొకరికి కుట్టడం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ రకమైన జ్వరం వచ్చి న వారికి ఒంటి నొప్పులు, తీవ్రమైన కీళ్ల నొప్పులు ఉండి కాళ్లు చేతుల్లో వాపులు కనిపిస్తాయి. మూడు నుంచి ఆరు నెలలపాటు ఈ నొప్పులు తగ్గవని వైద్యులు చెబుతున్నారు.

డయేరియా



కలుషిత నీరు, ఆహారం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల దయేరియా సోకుతుంది. వ్యాధిసోకిన వారికి నీళ్ల విరోచనాలు అవుతాయి. రోజుకు నాలుగు నుంచి ఐదుసార్లు విరోచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. అయితే రోగికి రోజులో పది నుంచి 20 సార్లు నీళ్ల విరోచనాలు అవుతాయి. వాంతులు కూడా ఎక్కువగా ఉంటాయి. కలుషితం వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది. కాబట్టి కుటుంబ సభ్యులతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అనారోగ్యాని కి గురయ్యే అవకాశం ఉంటుంది. వ్యాధికి గురైన వారు బాగా నీరసించడం, సురుకు తగ్గిపోయి మాట్లాడలేకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు

డయేరియా సోకిన రోగికి కాసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ, కొన్ని రకాల శీతల పానీయాలు ఇవ్వాలి. లీటర్ నీటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కలిపి మూడు నుంచి నాలుగు గంటలకు ఒకసారి తాగించాలి. ఈ సీజన్‌లో సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినకుండా ఉండటం మంచిది. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినవద్దు. విరేచనానికి వెళ్లి తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.

విరోచనాలు

ఫుడ్ పాయిజన్ కారణంగా కొన్ని సమయాల్లో తీవ్రమైన కడుపునొప్పి వచ్చి రక్త విరోచనాలు అవుతాయి. రక్తంతో కూడిన విరోచనాలు కావడంతో రోగి భయపడే ఆస్కారం కూడా ఉంటుంది.

ఇంట్లో దోమలు ప్రబలకుండా చూసుకోవాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌతమ్, జనరల్ మెడిసిన్ విభాగం, ఎంజీఎం ఆస్పత్రి



ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. శుభ్రమైన మంచినీటిని మాత్రమే తాగాలి. బయట పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇంట్లో ఆహారం తినే ముందు కాళ్లు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. ఇంట్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి ఆవరణలో పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలలో వర్షం నీరు నిలవడంతో దోమలు పెరుగుతాయి. దోమలు వ్యాప్తి చెందకుండా నివారించగలిగితే వ్యాధులు సోకే అవకాశం కూడా ఉండదు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత బదిలీ

నూతన ఆర్ఎంగా విజయభాను

బాలసముద్రం, జూన్ 15: వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత బదిలీ అయ్యారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ఆర్ఎం శ్రీలత రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, హైదరాబాద్‌లో చార్మినార్ డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయభాను వరంగల్ రీజినల్ మేనేజర్‌గా నియామకమయ్యారు. కాగా, 2022 నవంబరు 18న వరంగల్ రీజినల్ మేనేజర్‌గా శ్రీలత విధుల్లో చేరారు. మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ సేవలు అందించి ప్రజల నుంచి మన్ననలు పొందారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉమ్మడి జిల్లాలో విజయవంతంగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

టెస్కాబ్ కార్యాలయంలో మార్నేనికి సన్మానం

హనుమకొండ సిటీ, జూన్ 15: తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సన్మానించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత రవీందర్‌రావు తొలిసారిగా శనివారం హైదరాబాద్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణలోని డీసీసీ బ్యాంకుల చైర్మన్లు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు, కోశాధికారి అభయ్‌కుమార్ తదితరులు మార్నేనికి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

మార్కెట్లో పనుల కోసం టెండర్ల ఆహ్వానం

వరంగల్ వ్యవసాయం, జూన్ 15: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని పలు పనుల నిర్వాహణ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏనుమాముల మార్కెట్‌లో పల్లికాయ, పసుపు, పత్తి, మిర్చి, ధాన్యం, అపరాల యార్డులతోపాటు లక్ష్మీపురంలోని పాత, కొత్త మోడల్ కూరగాయల మార్కెట్‌లకు సంబంధించి జూలై 1 నుంచి 2025 మే 31 వరకు యార్డు క్లీనింగ్, పాన్ షాపులు, క్యాంటీన్ నిర్వాహణ, మరుగుదొడ్లకు సంబంధించి టెండర్లను ఆహ్వానించారు.

ఈ పనులు సంబంధించి మార్కెట్ కార్యాలయం పని వేళల్లో రూ.2000 చెల్లించి టెండర్ షెడ్యూల్ జూన్ 18 నుంచి 24 తేదీ వరకు పొందవచ్చని తెలిపారు. జూన్ 26న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లక్ష రూపాయల ఈఎండీ చెల్లించిన వారివి స్వీకరించబడునని, అదే రోజు సాయంత్రం 3 గంటలకు టెండర్లను తెరువబడుతాయని కార్యదర్శి ప్రకటనలో తెలిపారు.

ప్రజలు మోదీకి తగిన గుణపాఠం చెప్పారు..

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



ధర్మసాగర్ మండల కేంద్రంలో సీపీఐ జిల్లా శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి.

ధర్మసాగర్, జూన్ 15: దేశంలోని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మోదీ పదేళ్ల పాలనలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి విభిన్నంగా పాలన జరిగిందన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతులకను అణిచివేసి అనేక మందిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారని తెలిపారు. రైతులు, కార్మికులకు వ్యతిరేక చట్టాలు తెచ్చి ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టారన్నారు. చివరకు తెలంగాణకు రావాల్సిన విభజన హామీలను అమలు చేయకుండా మోసం చేశారన్నారు. దీంతోనే చావుతప్పి కన్ను లొట్టబోయిన విధంగా బీజేపీకి కేంద్రంలో మెజారిటీ రాలేదని తెలిపారు. టీడీపీ, జేడీయూ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. లోక్‌సభకు ఎన్నికైన వారిలో 259మంది నేరచరిత్ర గల వారు ఎంపీలుగా ఉన్నారని చెప్పారు. మంత్రి వర్గంలో కూడా నేర చరిత్ర ఉన్న వారితో నిండిపోయిందని ఆయన ఆరోపించారు. గతం కంటే ఇండియా కూటమి అధిక సీట్లు గెలిచి కేంద్రంలో ప్రతిపక్షంగా నిలిచిందన్నారు. వామపక్షాలు లేకుంటే ప్రజల మేలుకోరే చట్టాలు వచ్చేవి కావని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇష్టారీతిగా వ్యవరించడంవల్ల ప్రజలు ఇంటికి సాగనంపారని తెలిపారు. ప్రజలను విస్మరించి పాలన చేసిన వారికి ఇక్కట్లు తప్పవని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, రాజమౌళి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో ట్రాన్స్‌ఫర్స్ ఫీవర్

- బదిలీలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఏ ప్రాతిపదికన బదిలీలు చేస్తారో తెలియని పరిస్థితి
- మంచి స్థానం కోసం మొదలైన ముందస్తు పైరవీలు



రాంనగర్, జూన్ 15: రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ఫీవర్ ప్రారంభమైంది. నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో శాఖ ఉద్యోగులు ముందస్తు పైరవీలకు తెరలేపారు. ఏ ప్రాతిపదికన బదిలీలు చేస్తారో ప్రభుత్వం నుంచి స్పష్టత రానప్పటికీ ఎవరి స్థాయిలో వారు పైరవీలకు శ్రీకారం చుట్టారు. సబ్ రిజిస్ట్రార్లు ఆర్థిక లావాదేవీలు పుష్టిగా ఉన్నటువంటి స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కింది స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో స్థానం పొందేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పదేళ్ల కాలంలో 2022లో కేవలం సబ్ రిజిస్ట్రార్లను ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బదిలీలు చేశారు. కింది స్థాయి ఉద్యోగులను పదేళ్ల నుంచి కదుపలేదు. కింది స్థాయి ఉద్యోగులకు పదేళ్లగా పదోన్నతులు సైతం కల్పించలేదు. నగర ప్రాంత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారు అన్ని రకాలుగా లబ్ధి పొందుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవారు అన్ని రకాలుగా నష్టపోతున్నారు. పదేళ్లగా బదిలీల కోసం వేచి చూస్తున్న ఉద్యోగులు కోరుకున్న స్థానం కోసం లాబీయింగ్ చేస్తున్నారు.

స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

రిజిస్ట్రేషన్ శాఖ బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రెండేళ్ల కిందట సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు చేసిన గత ప్రభుత్వం.. 317 జీవో (జోన్ పరిధిలో) ప్రకారం ప్రక్రియ పూర్తి చేసింది. జిల్లాల వారిగా జాబితా తీసుకున్న ప్రభుత్వం.. పోస్టింగ్‌లు కేటాయిస్తూ జీవో జారీ చేసింది. ఈ జీవో ఆదారంగా సబ రిజిస్ట్రార్లు భద్రాద్రికొత్తగూడెం జోన్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల్లో పోస్టింగ్ పొందారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన బదిలీలను తప్పుపట్టినప్పటికీ ఎలా చేయబోతుందనే విషయమై స్పష్టత ఇవ్వలేదు. జీరో సర్వీసు తీసుకుంటుందా? రెండు లేదా మూడు సంవత్సరాల ఒకే స్థానంలో చేసిన సర్వీసును పరిగణలోకి తీసుకుంటుందా? జోన్, మల్టీజోన్ స్థాయిలో బదిలీలు చేస్తుందా? తెలియని పరిస్థితి. గత ప్రభుత్వం చేసినట్లు బదిలీల స్థానం కేటాయించి జీవో ఇస్తుందా? అనే ఆందోళన ఉద్యోగుల్లో ఉంది. ఒక వేళ మల్టీ జోన్ తీసుకుంటే గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్‌లో కొమురంభీం, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం జోన్‌ల పరిధిలోని జిల్లాలకు బదిలీ అవుతారు. నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయనున్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగుల వివరాల జాబితా సైతం తీసుకోలేదు. దీనితో అసలు ఈ శాఖలో బదిలీలు జరుగుతాయా? లేక మినహాయింపు ఇస్తారా అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

పోస్టింగ్‌ల కోసం ముందస్తు లాబీయింగ్

శాఖ ఉద్యోగులు మంచి పోస్టింగ్ కోసం ముందస్తు లాబీయింగ్ ప్రారంభించారు. జీరో సర్వీసుతో నేరుగా పోస్టింగ్ ఆర్డర్స్ వస్తాయనే ప్రచారం సాగుతుండటంతో పైరవీలు ముమ్మరం చేశారు. జోన్, మల్టీజోన్‌పై స్పష్టత రాకపోవడంతో ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్లు ఆర్థిక లావాదేవీలు అధికంగా ఉండే పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బెటర్ స్థానం దక్కించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యే వద్ద పడిగాపులు కాస్తున్నట్లు సమాచారం. బెటర్ పోస్టింగ్ కోసం ఎంతైనా ముట్టచెప్పేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కాగా జీరో సర్వీసును పరిగణలోకి తీసుకుని బదిలీలు జరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 13 కార్యాలయాల పరిధిలో అన్ని క్యాడర్‌లకు చెందిన 96మంది (40 జూనియర్ అసిస్టెంట్లు, 21 అటెండర్లు, 3 క్యాషియర్లు, 1 టైపిస్టు, 14 సీనియర్ అసిస్టెంట్లు,14 సబ్ రిజిస్ట్రార్‌లు, 2 డీఆర్‌లు, 1 డీఐజీ) స్థాన చలనం చెందే అవకాశం ఉంది.

ఈసీ లేదు.. వీసీ లేరు..

(5వ పేజీ తరువాయి)

యూనివర్సిటీకి 149 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కేయూకు మినహా మిగతా తొమ్మిది యూనివర్సిటీలకు ప్రభుత్వం ఇటీవల సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ సెర్చ్ కమిటీలు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ నెలఖారులోగా తొమ్మిది యూనివర్సిటీలకు కొత్త వైస్‌చాన్సలర్‌లను నియమించనున్నారు. కానీ కాకతీయ యూనివర్సిటీకి మాత్రం ఇన్‌చార్జి వీసీనే దిక్కుగా మారనున్నారనే చర్చ జరుగుతోంది. అయితే కేయూకు కొత్త పాలక మండలి నియామకం తరువాతే సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తారని, ఆ తరువాతనే కొత్త వీసీ వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కాకతీయ యూనివర్సిటీకి పాలక మండలిని నియమించి, వీసీ నియామకం కోసం సెర్చ్ కమిటీని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొనసాగుతున్న బడిబాట



రాంచంద్రుతండాలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నర్మెట, జూన్ 15 : జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాన్సింగ్‌తండా, రాంచంద్రుతండా, దొంగలచెలిమెతండాల్లో ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు బి.వాసు, హరిసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు మంచి సౌకర్యాలు కల్పిస్తోందని, ఉచిత పుస్తకాలు, సన్నబియ్యంలో భోజనంతో పాటు అనేక వసతులు కల్పిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి కిషన్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న బీజేపీ మండల అధ్యక్షుడు నాగేశ్ గౌడ్, నేతలు, కార్యకర్తలు

జఫర్‌గడ్, జూన్ 15 : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో స్థానిక సెంటర్ వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కొరుకొప్పుల నాగేశ్ గౌడ్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో బర్త్ డే కేక్ కట్ చేసి పేదలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. కిషన్‌రెడ్డి కేంద్రంలో మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం పార్టీకి అందించిన సేవలు, అతని పట్టుదల, కృషికి నిదర్శనమన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టవంతం చేసేందుకు కంకణబద్ధులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నేతలు తిరుపతి, మదన్‌మోహన్, రడపాక యాకలక్ష్మీ, పందిబోయిన రాజు, మారెపల్లి రవి, యాకస్వామి, చిరబోయిన కవిత, గాదెపాక శ్రీను, చవనబోయిన శ్రీనివాస్, వెంకటయ్య, ప్రేమ్‌కుమార్, సంగ గోపాల్, రవి, సంతోష్, కుంభం చంద్రమౌళి, రాజిరెడ్డి, దుద్దుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చారు.. ప్లాట్లు మరిచారు

- నాలుగు గ్రామాల్లో డబుల్ ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక
- పట్టాలు అందించిన అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య
- ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు ప్లాట్లు చూపించని అధికారులు



సముద్రాల గ్రామంలో నిర్మించి వదిలేసిన ఇండ్లు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 15: అదిగో వస్తున్నాయి.. ఇదిగో వస్తున్నాయి.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అని గత ప్రభుత్వం నిరుపేదలను ఆశ పెట్టి చివరికి ఇల్లుగాని, ఇంటి స్థలంగాని ఇవ్వకుండానే వెళ్లిపోయింది. మొదట స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్, సముద్రాల, పాంనూర్, కొత్తపల్లి గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. సముద్రాల, పాంనూర్, నెమలిగొండ గ్రామాల్లో కొన్ని పూర్తి కాగా, మరి కొన్ని బేసిమెంట్ వరకు పూర్తయ్యాయి. పూర్తికాని వాటిని లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకుంటే రూ.5లక్షలు ప్రభుత్వం నుంచి ఇప్పిస్తామని చెప్పి అధికారులు అబ్ధిదారులను ఎంపిక చేసి శాంపిల్స్‌గా కొందరికి పట్టాలు అందించారు.

రాఘవపూర్ గ్రామంలో 2015లో 40 డబుల్ ఇళ్ల నిర్మాణానికి అప్పటి నాయకులు శంకుస్థాపన చేశారు. 2017లో నిర్మాణం పూర్తయింది. వాటిలో 33ఇళ్లకు 2019 డిసెంబర్‌లో గ్రామసభ ద్వారా అబ్ధిదారులను ఎంపిక చేసి మంత్రుల చేతుల మీదుగా పత్రాలు అందించారు. మిగతా 7గృహాలను నేటి వరకు లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో శిథిలావస్థలకు చేరుతున్నాయి.

కొత్తపల్లి గ్రామంలో 30 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తి కాగా, ఏడాది క్రితం గ్రామ సభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి 27మందికి పట్టాలు అందించారు. మిగతా 3గృహాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల కోడ్ రావడంతో ఇళ్లవద్ద మౌలిక సదుపాయాలు లేనప్పటికి ఎవరికివారు వెళ్లి ఇళ్లలో ఉంటున్నారు.

సముద్రాల గ్రామంలో 40 ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అందులో కేవలం 8గృహాలను మాత్రమే కాంట్రాక్టర్ నిర్మించి వదిలేశాడు. అయినప్పటికీ అధికారులు 40 గృహాల కోసం అసెంబ్లి ఎన్నికలముందు లబ్ధిదారులను గ్రామ సభ ద్వారా ఎంపిక చేశారు. వారిలో కొందరికి శాంపిల్‌గా పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పాంనూర్ గ్రామంలో 40మంది లబ్ధిదారులను, నెమలిగొండలో 30 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. కాని వారికి పట్టాలు ఇచ్చిందిలేదు. ప్లాట్లను చూపించింది లేదు. ఏడాదిగా ఇంటి పట్టాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

25ఏళ్లుగా ఎదురుచూపులు...

నెమలిగొండ గ్రామానికి చెందిన లబ్ధిదారులు 25ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామ పరిధిలోని 175 సర్వే నెంబర్‌లో అప్పటి ఎమ్మెల్యే కడియం శ్రీహరి 180 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో వారికి ప్లాట్లను అందించలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 180 లబ్ధిదారులకు మరో 60మంది లబ్ధిదారులను కలిపి 240 మంది లబ్ధిదారులకు స్థలాలు అందించేందుకు సిద్ధమైనప్పటికి కార్యరూపం దాల్చలేదు. నాటి నుంచి ఇంటిపట్టాల కోసం లబ్ధిదారులు సదరు స్థలంలో గుడిసెలు వేసి, విభిన్న రీతుల్లో ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు 2023 చివరలో పట్టాలు ఇచ్చి స్థలాలను కేటాయించేలా అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసి మాజీ ఎమ్మెల్యే చేతుల మీదుగా కేవలం 20మందికి పట్టాలు ఇచ్చారు. మిగితా వారికి వారం రోజుల్లో పట్టాలు అందించి ఇంటి స్థలాలకు పొజిషన్ చూపిస్తామని చెప్పిన అధికారులు నేటికీ లబ్ధిదారులకు పట్టాలు, పొజిషన్ చూపించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి స్థలాన్ని చూపించలేదు..

గాదె అనిత, నెమలిగొండ



25 ఏళ్లుగా ఎదురుచూడగా గత ఏడాది చివరిలో గ్రామ సభ ద్వారా అబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ ఇప్పటికి ఇంటి స్థలాన్ని అధికారులు చూపలేదు. అనేక ఏళ్లుగా మోసపోతునే ఉన్నాం. మా బాధలు అర్థం చేసుకొని ఇంటి స్థలాలు చూపించాలి.

నాపేరు రావడంతో సంతోషపడ్డాను..

బత్తిని మల్లయ్య, పాంనూర్



గ్రామంలో 40 డబుల్ ఇళ్ల కోసం లబ్ధిదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసే క్రమంలో డ్రాలో నా పేరు రావడంతో సంతోషపడ్డాను. కాని నేటికి ఇంటి స్థలాన్ని, కాని ఇంటిని కాని అధికారులు చూపలేదు. పూరిగుడిసెలో మగ్గతున్నాం. ఇళ్లు వస్తదని ఎదురుచూస్తున్నాం.

వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలి..

గాదె రాజు, నెమలిగొండ



గత ప్రభుత్వంలో లబ్ధిదారులను ఎంపిక చేసనప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు పట్టాలు అందించి పొజిషన్ చూపించి చిత్తశుద్ధి చాటుకోవాలి. అనేక ఏళ్లుగా గ్రామస్థులు ఇంటి స్థలం వస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.



పాంనూర్‌లో అసంపూర్తిగా వదిలేసిన డబుల్ ఇళ్లు



డబుల్‌బెడ్ రూమ్ ఇంటిలో కట్టేసిన పశువులు



నిల్వచేసిన వరిగడ్డి కట్టలు

ఇసుక అనుమతులు వెంటనే నిలిపివేయాలి

దేవరుప్పుల మండలసభలో తీర్మానం



సభలో మాట్లాడుతున్న జడ్పీటీసీ పల్లా భార్గవి

దేవరుప్పుల, జూన్ 15: మండలంలోని గ్రామాల పరిధిలో ఉన్న వాగులనుంచి రిజర్వాయర్లకు తరలిస్తున్న ఇసుక అనుమతులను వెంటనే రద్దు చేయాలని మండల సభలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శనివారం దేవరుప్పుల మండల పరిషత్తు కార్యాలయంలో దేవరుప్పుల మండలసభ ఎంపీపీ బస్వ సావిత్రి అధ్యక్షతన జరుగగా జడ్పీటీసీ పల్లా భార్గవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల సాగునీటి వనరులు పెంపొందించేందుకు చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టి, గొలుసుకట్టు చెరువులను మరమ్మతు చేయించిందని తెలిపారు. దేవరుప్పుల ప్రాంతంలో వనరులు పెరుగగా వాగులోని ఇసుకను తోడుకపోతే భూగర్భ జలాలు అడుగంటి పోయి రైతుల బోర్లు వట్టిపోతాయన్నారు. ఇతర మండలాలకు తరలించే ప్రసక్తే లేదని సభ్యులు ఏకగ్రీవంగా అభిప్రాయం తెలుపగా వెంటనే తీర్మానం ప్రవేశపెట్టాలని ఎంపీపీ బస్వ సావిత్రి ఎంపీడీవో లక్ష్మీనారాయణను కోరారు. అదే విధంగా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా దోమల నివారణకోసం గ్రామాల్లో క్లోరినేషన్ చేయించాలని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. చిన్నమడూరులో డబుల్‌బెడ్ రూం ఇండ్ల ఇండ్ల నిర్మాణం నత్తనడకన నడుస్తున్నదని వేగవంతంగా జరిగేలా చూడాలని అన్నారు. చిన్నమడూరు గ్రామంలో ఈజీఎస్‌లో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగాయని, పనిచేయని వారికి బిల్లు చెల్లింపులు జరుపుతున్నారని, చేసిన వారికి బిల్లులు రావటం లేదని ఆ గ్రామ ఎంపీటీసీ గొడుగు సుజాత సభ దృష్టికి తెచ్చారు. వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఇరువై ఏళ్ల కింద స్థలాలు కొనుక్కొని ఇండ్లు నిర్మించుకోగా రికార్డుల్లో ఆ పట్టేదారు భూమిని తొలగించలేదన్నారు. ఎంపీటీసీలకు మండల సభ చివరి సమావేశం కావటంతో జడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల మండల అభివృద్ధికి సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య



నర్మెట, జూన్ 15 : మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుపల్లి గ్రామానికి చెందిన జంజాల భీమయ్య(64)కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు విజయ్, రోహిత్ కూతూరు విజయ నిర్మల ఉన్నారు. వారిలో ఇద్దరు కుమారులకు వివాహం కాగా భర్తతో గొడవ పెట్టుకొని చిన్న కోడలుకు తల్లిగారింటికి వెళ్లిపోయింది. మరోవైపు ఆర్థిక స్తోమత లేక భీమయ్య కూతురుకు వివాహం చేయలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డిమందు తాగి పడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కానిస్టేబుల్ హిదాయత్‌అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అంగడి వేలం

రూ.3.89 లక్షలకు దక్కించుకున్న వెంకట్‌రెడ్డి



బచ్చన్నపేట వేలం పాటలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్

బచ్చన్నపేట, జూన్ 15: బచ్చన్నపేట గ్రామంలో జరిగే వారాంతపు పశువుల సంతకు తైబజార్, దక్కాకు గాను శనివారం వేలం పాటలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి, గ్రామ ప్రత్యేకాధికారి వినోద్‌కుమార్, ఎంపీడీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అనిల్ రాజ్ తదితరులు పాల్గొనగా బచ్చన్నపేటకు చెందిన బొడిగం వెంకట్‌రెడ్డి రూ. 3.89 లక్షలకు పాటపాడి పశువుల అంగడి వేలం దక్కించుకున్నారు. అదే విధంగా దక్కాకు గాను బసిరెడ్డిపల్లికి చెందిన తేలు అంజయ్య రూ.16 వేలకు వేలం దక్కించుకున్నారు. తై బజార్‌కు సరైన పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు ప్రత్యేకాధికారి వినోద్‌కుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది చక్రధర్, అశోక్, మురళి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

రఘునాథపల్లి, జూన్ 15: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోమల్ల పిహెచ్‌సీ వైద్యాధికారి అబ్బు మధుకర్ యాదవ్ అన్నారు. ఈ నెల 20న జరుగనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కోమల్ల పిహెచ్‌సీలో అవగాహన సమావేశం నిర్వహిచాఆరు. అల్బెండజోల్ మాత్రల పంపిణీపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-19 సంవత్సరాల పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నమ్రత, సిహెచ్‌వో సీనారాణి, ప్రమీల, జిలాని, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

'గోవధ జరగకుండా చూడాలి'

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 15: బక్రీద్ పండుగ సందర్భంగా మండల పరిధిలో గోవధ జరుగకుండా చర్యలు తీసుకోవాలని విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు శనివారం సీఐ ముస్కు రాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా డివిజన్ కేంద్రంలో పలు చోట్ల నిర్వహించే గోవధను నిర్మూలించడానికి అందరు సహకరించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో విహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అందె వేణు, మండలాధ్యక్షుడు కూరోజు సదానందచారి, భజరంగ్‌దళ్ జనగామ జిల్లా కన్వీనర్ గోనెల రమేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలనుపాక శరత్ కుమార్ ఉన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

చిలుపూర్, జూన్ 15: మండలంలోని నష్కల్, వంగాలపల్లి అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులకు శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాలామృతంతో పాటు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ మాట్లాడుతూ చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను రిజిస్టర్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో శ్యామ్, రంగు ఉమారాణి, అర్కాల భాగ్యలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గోపాల్‌నగర్‌లో మళ్లీ వెలిసిన గుడిసెలు

- భారీగా తరలివచ్చిన గుడిసెవాసులు
- సీపీఎం అధ్వర్యంలో ఆందోళన
- ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్



గోపాల్‌నగర్‌లో మోహరించిన కేంద్ర బలగాలు

బచ్చన్నపేట, జూన్ 15: గోపాల్‌నగర్‌లో శనివారం తెల్లారే సరికే మళ్లీ గుడిసెలు వెలిశాయి. సీపీఎం అధ్వర్యంలో పేదలు గోపాల్‌నగర్‌లోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 174లోని ఎనిమిది ఎకరాల్లో కర్రలు కట్టి, చీరలతో గుడిసెలు వేశారు. సీపీఎం జిల్లా నాయకులు విజేందర్, మండల నాయకులు బెల్లంకొండ వెంకటేశ్, పర్వతం నర్సింహులు అధ్వర్యంలో అన్ని గ్రామాల నుంచి గుడిసెవాసులు తరలి వచ్చారు. విషయం తెలుసుకున్న జనగామ ఏసీపీ అంకిత్‌కుమార్, నర్మెట సీఐ సాయిరమణ, ఎస్సైలు శ్రీకాంత్, శ్వేతలతో పాటు భారీగా కేంద్ర బలగాలు మోహరింపచేశారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో ఇలా గుడిసెలు వేయడం నేరమని, వెంటనే వాటిని తొలగించాలని, లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు ఉంటాయని పోలీసులు చెప్పినా వారు వినలేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి గొడవలు కాకుండా ఉండడానికి స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలను రప్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ సూచన మేరకు సీపీఎం నేతలు కలెక్టర్ వద్దకు వెళ్లి సమస్యను వివరించారు. ప్రభుత్వ భూమి అయినందున గుడిసెలు వేశామని, మాకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలందరికీ ప్రభుత్వం స్థలం కేటాయించి, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. సీపీఎం నేతలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు శత నృత్య పరన మహాయజ్ఞం

జనగామ కల్చరల్, జూన్ 15: మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈ నెల 16న అష్టోత్తర శత నృత్య పరన ధ్యాన మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం నిర్వాహకులు పులిగిళ్ల సుకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో 108 మంది విద్యార్థులతో కూచిపూడి నృత్యం, భజగోవింద శ్లోకాలు, ధ్యానం ఉంటుందన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి, జూన్ 15: మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన కోతి అనిల్ అనే గీత కార్మికుడు తాటి చెట్టుపైకి ఎక్కుతుండగా శనివారం ప్రమాదవశాత్తు జారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అనిల్‌ను వరంగల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఔదార్యం చూపిన దంపతులు


విద్యార్థులకు రూ.25 వేల విలువైన స్టేషనరీ అందజేత



విద్యార్థులకు నోట్ బుక్స్ అందిస్తున్న అజయ్‌కుమార్ దంపతులు

జఫర్‌గడ్, జూన్ 15 : మండలంలోని కూనూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల పట్ల దంపతులు ఔదార్యం చూపారు. పాలకుర్తి మండలం చెన్నూరు వాస్తవ్యులు, హైద్రాబాద్‌లోని అరోరా ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మహాభాష్యం చక్రవర్తుల అజయ్‌కుమార్ - పద్మ దంపతులు రూ.25 వేలు విలువ గల నోటు పుస్తకాలు, స్టేషనరీని అందజేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో దాత అజయ్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించడమే తమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఎండి.పర్వేజ్, హెచ్‌ఎం.కె.సురెందర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ కోట రేణుక, మాజీ సర్పంచ్ కుమార్, పి.జయపాల్‌రెడ్డి, మద్దిరాజు, చక్రవర్తుల రామానుజం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రజకుల చేయూత



రవి కుటుంబీకులకు రూ.1.10 లక్షల డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న రజక రిజర్వేషన్ సమితి నాయకులు

జఫర్‌గడ్, జూన్ 15 : మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన సాంబరాజు రవి కుటుంబానికి రజక రిజర్వేషన్ పోరాట సమితి తరఫున ఆర్థిక చేయూతనందించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా పని చేసిన రవి గత ఏడాది గుండెపోటుతో అకాల మరణం చెందాడు. అతడిది పేద కుటుంబం కావడంతో సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు స్పందించి.. తలా కొంత డబ్బును పోగు చేసి మొత్తం ఒక లక్ష రూపాయలను రవి కుమార్తె భావన పేర బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ పత్రంతో పాటు మరో రూ.10 వేలు నగదును శనివారం తిమ్మాపూర్‌లోని బాధిత కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఆర్‌ఎస్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి సాంబరాజు రవి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అశోక్, రాజేశ్వరి శ్రీనివాస్, సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు చిట్యాల రాంచంద్రం, సంపత్, రాపర్తి సోమయ్య, ఉల్లంగల యాదగిరి, సాంబరాజు కుమార్, జలెందర్, వీరన్న, యుగంధర్, యాకయ్య, నరేశ్, రాములు, ఉల్లెంగల రాజు, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ సమస్యను పరిశీలించిన ఆర్డీవో

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 15: ఆర్డీవో ధరంసోత్ వెంకన్న శనివారం డివిజన్ కేంద్రంలోని పలు వీధులను అధికారులతో కలిసి పరిశీలించారు. 1వ వార్డులోని బరోడా బ్యాంకు వీధిలో కొన్ని ఏళ్లుగా ప్రజలు డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని పర్యటించారు. గృహాల మధ్య మురుగునీరు నిలువకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి సమీక్షించారు. నీరు నిలువకుండా వీధిలో డ్రైనేజీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, సంబంధిత అధికారులు డ్రైనేజీ నిర్మాణానికి వెంటనే ఎస్టిమేషన్స్ తయారు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, డీఈ కరణ్‌కుమార్, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, ఈవో సత్యనారాయణ, సింగపురం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో కలెక్టర్ల బదిలీలు

- హనుమకొండ నూతన కలెక్టర్‌గా ప్రావీణ్య
- వరంగల్ కలెక్టర్‌గా సత్యశారదా దేవి



ప్రావీణ్య, హనుమకొండ | సత్య శారదాదేవి, వరంగల్ | రాహుల్ శర్మ, భూపాలపల్లి | దివాకర, ములుగు

హనుమకొండ కలెక్టరేట్, జూన్15: హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరిగిన బదిలీల్లో భాగంగా సిక్తా పట్నాయక్‌ను నారా యణపేటకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు నూతన కలెక్టర్‌గా వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న పి.ప్రావీణ్యను నియ మించారు. రాష్ట్రంలో కొత్తప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్ది రోజులకే ప్రభుత్వం తాత్కాలిక బదిలీలు జరిపింది. గత ప్రభుత్వ హయాంలో పలు స్థానాల్లో ఉన్నవారిని మార్చింది. అనంత రం లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో బదిలీలు నిలిచాయి. ఎన్నికలు ముగియడంతో పాలనాపరమైన ప్రక్షాళనలో భాగంగా కలెక్టర్లను బదిలీ చేసింది.

హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్ 2023 ఫిబ్రవరి 1న బాధ్యతలు చేప ట్టారు. అంతకుముందు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నిజామాబాద్‌కు బదిలీ కాగా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సిక్తా పట్నాయక్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా నియమించారు. అప్పటి నుంచి 16నెలల పాటు జిల్లాలో సమర్థ పాలన అందించారు. ఈమె పాలన కాలంలో జిల్లాలో కొంతమేరకు అభివృద్ధి జరిగింది. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేసి కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొని సమస్యలపై ప్రజావాణికి వచ్చే ప్రజల స మస్య లు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేశారు.

ప్రావీణ్య సుపరిచితురాలే..

హనుమకొండ జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియామకమైన పి.ప్రావీణ్య జిల్లాకు సుపరి చితురాలే. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రావీణ్య.. 18నెలల పాటు గ్రేటర్ వరంగల్ ము నిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిం చారు. 2023 మార్చి 13వ తేదీన వరంగల్ జిల్లా కలెక్టర్‌గా నియామకమయ్యారు. 15నెలల పా టు జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలు, వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను సజావుగా జరిగేందుకు కృషి చేశారు.

ములుగు, భూపాలపల్లి కలెక్టర్ల బదిలీ

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్: భూపాలపల్లి, ములుగు జిల్లాల కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఇలా త్రిపాఠి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో భూపాలపల్లికి రాహుల్ శర్మ, ములుగుకు దివాకర బదిలీపై వస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి శనివారం ఉ త్తర్వులు జారీ చేశారు. 2017 ఐఏ ఎస్ బ్యాచ్ కు చెందిన రాహుల్ శర్మ ప్రస్తుతం వికారాబాద్ అదన పు కలెక్టర్ (స్థానిక సంస్థల)గా పనిచేస్తున్నారు.

భూపాలపల్లి కలె క్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. భూపాలపల్లి కలెక్టర్ గా పనిచేసిన భవేష్ మిశ్రాకు ప్రభుత్వం ఎలాం టి పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఆయన జీఏడీలో రిపోర్ట్ చేయనున్నారు. ములుగు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఇలా త్రిపాఠి బదిలీ కాగా, ఆమె స్థానంలో జగి త్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కొనసాగుతున్న 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దివాకర రానున్నారు. ఈయన 2021 ఆగస్టు నుంచి 2023 జూలై 15వరకు భూపాలపల్లిలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ములుగు కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

వరంగల్ కలెక్టర్‌గా సత్యశారదా దేవి

వరంగల్ కలెక్టరేట్: వరంగల్ జిల్లా కలె క్టర్‌గా అగ్రికల్చర్, కో ఆపరేషన్ డిపార్ట్ మెంట్ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న సత్య శార దాదేవి నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ పి.ప్రావీణ్య హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బది లీ అయ్యారు. కలెక్టర్‌గా ప్రావీణ్య సుమారు 15నెలల కాలంలో వరంగల్ జిల్లాలో తనదైన ముద్ర వేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్‌గా సత్య శారదాదేవి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.